మాటలు ఘనం.. పనులు శూన్యం

- నరసాపురంలో పడకేసిన అభివృద్ధి
- ఆరు నెలల కూటమి ప్రభుత్వంలో ఒక్క అడుగు ముందుకు కదలని కీలక ప్రాజెక్టులు



వంతెన లేకపోవడంతో నరసాపురం వశిష్ట గోదావరిపై పంటుపై నది దాటుతున్న జనం

నరసాపురం: 19 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న నియోజకవర్గం నరసాపురం. అభివృద్ధికి అన్ని అవకాశాలూ ఉన్నా కూడా గత పాలకుల నిర్లక్ష్యంతో వెనకబడిపోయింది. 2019–24 మధ్య కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా నరసాపురం అభివృద్ధికి బీజం పడింది. రికార్డు స్థాయిలో నియోజకవర్గంలో 3 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కొన్ని ప్రాజెక్ట్‌ల పనులు కూడా ప్రారంభించారు. మిగిలిన ప్రాజెక్ట్‌లకు నిధులు మంజూరు చేసి పెట్టారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో కూటమినేతలు అనేక హామీలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ప్రాజెక్ట్‌లు వెంటనే పూర్తి చేసి అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తామన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోయాయి. జగన్ సర్కార్ హయాంలో ప్రారంభించిన అన్ని ప్రాజెక్ట్‌లు నిలిచిపోయాయి. ఇక కొత్తగా ఒక్క రూపాయి పని కూడా నియోజకవర్గంలో జరగలేదు. దీనిపై నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వశిష్ట వంతెన సంగతేంటి?

ఉభయగోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛ అయిన నరసాపురంలో వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం. దీనిని సాకారం చేస్తూ జగన్ సర్కార్ రూ 640 కోట్లతో వంతెన నిర్మించేలా టెండర్లు పిలిచింది. స్వయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పుడు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని ఒప్పించి అంబేడ్కర్ కోనసీమ జిల్లా శివకోడు నుంచి ఉన్న రాష్ట్ర రహదారిని జాతీయరహదారిగా మార్పుచేసి బైపాస్ నిర్మించి, నరసాపురం 216 జాతీయ రహదారికి కలిపేలా, మధ్యలో గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మించేలా ఒప్పించారు. టెండర్లు కూడా పిలిచారు. కూటమి నేతలు తమ అనునాయులతో కోర్టు చిక్కులు తెప్పించి పనులు ఆపించారు. ఈ ఆరు నెలల్లో ఈ వంతెన విషయంలపై ఏమాటాలేదు. రూ 360 కోట్లతో బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ పనులు జగన్‌సర్కార్ మొదలు పెట్టింది. తాము అధికాంలోకి వస్తే హార్బర్ పనులు పరుగులు పెట్టిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఊదరగొట్టారు. ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. అలాగే రూ.61 కోట్లతో పట్టణంలో మంచినీటి పైప్‌లైన్స్ ప్రక్షాళన ప్రాజెక్ట్, రూ.220 కోట్లతో మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం, రూ 120 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ 400 కోట్లతో మోళ్లపర్రు వద్ద రెగ్యులేటర్ల నిర్మాణం వంటి కీలక ప్రాజెక్ట్‌లు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చీరాగానే రోడ్లు నిర్మాస్తామని హామీలు ఇచ్చారు. ఈ 6 నెలల్లో ఒక్క అంగుళం కూడా కొత్తరోడ్డు నిర్మించలేదు సరికదా, కనీసం మరమ్మతులు కూడా చేయలేదు.

నిలువునా దగాపడ్డ మత్స్యకారులు

ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏమీ అమలు కాకపోవడంతో నియోజకవర్గ ప్రజలు నిలువునా దగాపడ్డారు. నియోజకవర్గంలో 50వే ల మంది మత్స్యకారులున్నారు. వేటని షేధసమయంలో ఇచ్చే మత్స్యకార భరోసా పథకాన్ని ఎగ్గొటంతో మత్స్యకార కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయాయి. 2019 నుంచి 24 వరకూ జగన్‌సర్కార్ 5 ఏళ్లపాటు నిరాటంకంగా వేట సాగించే ఒక్క మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున మత్స్యకార భరోసా అందించింది. నియోజకవర్గంలో 26వేల కుటుంబాలకు అమ్మఒడి పథకం అందేది. ఫీజురీయింబర్స్‌మెంట్, రైతుభరోసా, నేతన్న భరోసా వంటి పథకాలులు ఏమీలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉచిత గ్యాస్ పథకం మలు చేస్తున్నామని చెప్పుకుంటున్నా సిలిండర్ తీసుకున్న కేవలం 30శాతం మందికి మాత్రమే ఇప్పటి వరకూ సొమ్ములు పడ్డాయి.

రైతులకు భరోసా ఏదీ?



రైతు భరోసా డబ్బులు వేయలేదు జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా పంటసాగు సమయంలోనే రైతుభరోసా సొమ్ములు మా ఖాతాల్లో వేసేవారు. పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. ఎన్నికలప్పుడు రైతులకు కష్టం రానివ్వమని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడు రైతుభరోసా సొమ్ములేదు. కోతలు అయిపోయాయి. మళ్లీ పంట సాగు చేయాలంటే పెట్టుబడి కావాలి.

–బైనపాలెం పండు, ఎల్‌బీచర్ల

18వ వార్డులో పారిశుధ్య పనులు

నరసాపురం: పట్టణంలోని 18వవార్డు శివాలయం వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయి పారిశుధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేయించారు. పిచ్చిమొక్కలు తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

నేటి నుంచి 19 వరకు గ్రామ సభలు

మొగల్తూరు: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఈ నెల 12 నుంచి 19 వరకు సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి బుధవారం విలేకరులకు తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య కాలంలో జరిగిన పనులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12న మొగల్తూరు, పేరుపాలెం సౌత్, నార్త్, ,కాళీపట్నం తూర్పు,పడమర, రామన్నపాలెం, 14న ముత్యాలపల్లి, 15న కేపీ పాలెం నార్త్, 16న కొత్తోట, వారతిప్ప, పాతపాడు, 18న మోడి, జగన్నాథపురం, 19న కొత్తపాలెం, శేరేపాలెం, కేపీ పాలెం సౌత్, కోమటితిప్ప గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

రేపు రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

పాలకొల్లు అర్బన్: 'రైతులకు అండగా వైఎస్సార్ సీపీ' అనే నినాదంతో ఈ నెల 13న జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేయనున్నట్లు స్థానిక పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు పట్టణంలోని యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నుంచి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8.30గంటలకు ర్యాలీగా భీమవరం వెళ్లి జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

యలమంచిలి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఆరు రోజులపాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో గ్రామ సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, అగ్రికల్చరల్ అసిస్టెంట్స్, హార్టికల్చరల్ అసిస్టెంట్స్, యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్స్‌లకు, 17, 18 తేదీల్లో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5) లకు, 19, 20 తేదీలలో పిషరీస్ అసిస్టెంట్స్, ఏఎన్‌ఎం, మహిళ పోలీస్, ఎనర్జీ అసిస్టెంట్స్, వీఆర్వోలు, పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

వైభవంగా మదనగోపాల స్వామి కల్యాణోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని చిట్టవరంలో ఉన్న శ్రీ మదనగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాన్ని బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను నక్కా శ్రీనివాస్, చల్లా భాస్కర్ వీరేంద్ర ప్రారంభించారు. బుధవారం రాత్రి కల్యాణోత్సవ వేడుకల్లో గ్రామానికి చెందిన పైడికొండల వెంకట గోపాలకృష్ణ, విజయలక్ష్మి దంతులు పాల్గొని మేళతాళాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి గోపి ఆధ్వర్యంలో కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బాల్య వివాహాలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ప్రతి అమ్మాయీ వారికున్న హక్కుల గురించి తెలుసుకోవాలని ఆయుర్వేద వైద్యురాలు జీడీఎస్ మల్లేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం లో బోటనీ, జంతు శాస్త్ర విభాగం సహకారంతో నేషనల్ జెండర్ క్యాంపెయిన్ చేతన్ 3.0లో భాగంగా చైల్డ్ మ్యారేజెస్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ ఎన్.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

కాపవరంలో ఫ్యామిలీ ఫిజిషియన్

పాలకొల్లు అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి డా.వర్ధనపు స్వరూప్ అన్నారు. మండలంలోని కాపవరంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని డా.స్వరూప్ సందర్శించి రోగులకు వైద్య సేవలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్లు అడ్డాల ప్రతాప్‌కుమార్, ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ క్రీడాకారులకు ఆతిథ్యం

పాలకొల్లు సెంట్రల్: ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 49వ జాతీయ బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరంలో ఏపి స్టేట్ బాలికల సబ్ జూనియర్స్ టీం పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుండి 17 మంది బాలిక క్రీడాకారిణులు తర్ఫీదు పొందుతున్నారు. ఈ క్రీడాకారులకు రోటరీ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో ఆతిథ్యం అందించారు. క్రీడాకారిణులకు బుధవారం టిఫిన్స్, స్నాక్స్, భోజనాల ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

కరెంట్ చార్జీలను తగ్గించాలని ధర్నా

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుఉందని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ ఆవేద వ్యక్తం చేశారు. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరక గ్రామంలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో బుధవారం కరెంటు బిల్లు పెంచడానికి నిరసనగా కరెంట్ బిల్లు దగ్ధం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారు 2000 సంవత్సరంలో కరెంటు చార్జీలు పెంచినప్పుడు జరిగిన పరిణామాలు గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. పెరుగుతున్న చార్జీలతో ప్రజలు కరెంటు బిల్లు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల్లో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రూ అప్ చార్జీలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు నెలలైనా అందని టిడ్కో ఇళ్లు



టిడ్కో గృహాల సముదాయం (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: నీకు 15వేలు, నీకు 15, నీకు 15, నీకు 18 నీకు 18, ఇదిగో నీకు ఈ పాపకు కూడా 15 వేల రూపాయలు ఇస్తామని చక్కని మాటలతో అబద్ధాల హామీలు గోడ కట్టినట్టు చెప్పారు నాడు స్థానిక శాసనసభ్యుడు మంత్రి నిమ్మల రామానాయుడు. అధికారం రావడమే ఆలస్యం పథకాలన్నీ ఇంటికి క్యూ కట్టేస్తాయని నమ్మబలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ప్రజలు చెబుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు, ప్రస్తుత రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 2019 ఎన్నికల్లో తన రాజకీయ లబ్ధి కోసం పెంకుళ్ల పాడు టిడ్కో గృహాలు పనులు పూర్తికాకుండానే 2019 ఫిబ్రవరి 10న అప్పటి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణచే గృహప్రవేశాలు చేయించారు. అప్పుడు పత్రాలు ఇచ్చారు తప్ప ఎవ్వరికీ ఇళ్లు ఇవ్వలేదు. అయినా సరే నాటి నుంచి 2024 ఎన్నికల వరకూ టిడ్కో గృహాలు టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన 10 శాతం పనులు చేయాల్సి ఉందని చెప్పుకుంటూ వచ్చారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రావణమాసంలో అర్హులైన లబ్ధిదారుడికి టిడ్కో గృహాల్లో గృహప్రవేశాలు చేయించి గృహలక్ష్మిని ఇంటికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 6, 2024న పాలకొల్లు ఎన్నికల బహిరంగ సభలో రామానాయుడే కాకుండా అధినేత చంద్రబాబు నాయుడుతో కూడా హామీ ఇప్పించారు. అయితే శ్రావణ మాసం వెళ్లిపోయి నెలలు గడిచిపోతున్నాయి తప్ప ప్రభుత్వ నేతల్లో మాత్రం చలనం లేదు. టిడ్కో గృహాల రుణాలు రద్దు చేస్తామని లబ్ధిదారులను నమ్మించారు. ఆ రుణాలు ఎప్పుడు రద్దు చేస్తారో నేటికి ప్రశ్నగానే ఉంది. యలమంచిలి మండలంలో కనకాయలంక గ్రామస్తులకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని హామి ఇచ్చారు. పట్టణంలో ఆర్యవైశ్యులకు ఆరాధ్యదైవమైన వాసవీమాత ఆలయం నిర్మాణానికి కోటి రూపాయలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు కనీసం ఈ హామీలకు శిలాఫలకమైనా వేశారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంకట్రాజుగుప్తా కళాక్షేత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినా ఆ దిశగా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఊసే లేని వారధి నిర్మాణం



కోడేరు వద్ద గోదావరి

పెనుగొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తికావస్తున్నా కోడేరు వారధి ఊసే లేదంటూ లంక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీనే నిలబెట్టుకోవడానికి నేటి వరకూ కనీసం ప్రతిపాదన స్థాయికి చేరుకోలేదు. ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ ఆచంట మండలంలోని లంక గ్రామాల మీదుగా గన్నవరం వారధి నిర్మాణం లంక వాసులకు 15 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది. దీంతో పాటు గోదావరి మధ్యలో లంక గ్రామాలైన అయోధ్యలంక, పుచ్చల్లంకలను కలుపుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో శంకుస్థాపన చేసినా నేటివరకూ అడుగు ముందుకు పడలేదు. చంద్రబాబు అయోధ్యలంకలో వరదల సమయంలో పర్యటించినపుడు, జనవరిలో ఆచంటలో నిర్వహించిన సభలోనూ అధికారంలోకి రాగానే బ్రిడ్జి నిర్మాణం చేస్తానంటూ హామీ ఇచ్చారు. ఈ హామీ కలగానే మిగలిపోయింది. దీంతో వరదల సమయంలో లంకవాసులు నానావస్థలకు గురవుతున్నారు. అలాగే సంక్షేమంలోనూ చంద్రబాబు ప్రజలు మోసం చేశారంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్‌సిక్స్ హామీని వాయిదా వేస్తూ ప్రజలు మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఆచంట నియోజకవర్గంలో రూ.1583 కోట్ల సంక్షేమం అందించడంతో, ఆరు నెలలు కాలంలో ఎటువంటి సంక్షేమం అందించలేదంటూ పెదవి విరుస్తున్నారు.

ప్రజలను మోసగించారు



సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను మోసగించారు. జూన్ నెల నుంచి ప్రజలకు అందించాల్సిన అమ్మ ఒడి, చేయూత, విద్యా దీవెన, ఫీజు రీఎంబర్స్ మెంట్ వంటి పథకాలకు తిలోధకాలు ఇచ్చారు. దీంతో పేదలు విద్యకు దూరం అవుతున్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారు.

– కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

ఘనంగా గీతా జయంతి



భగవద్గీత పారాయణం చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: గీతా జయంతి వేడుకలు నరసాపురం పట్టణంలోని రాజగోపాల స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిమేటి కృష్ణవేణి మాట్లాడుతూ ఒక గ్రంథానికి జయంతి జరగడం విశేషమని, ప్రపంచంలోనే ఆ గౌరవం ఒక్క భగవద్గీతకే దక్కిందని అన్నారు. గీత ఒక మతానికో, వర్గానికో, జాతికో సంబంధించినది కాదని సమస్త మానవాళి అభ్యున్నతికి భగవద్గీత మార్గదర్శిఅని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వీవీ భారతి, ఉషారాణి, మంగతాయారు, దూళిపాల అరుణ, సత్రశాల దీప్తి, నాగలక్ష్మి, కనకదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



చండీహోమం నిర్వహిస్తున్న రుత్వికులు

పాలకొల్లు అర్బన్: ప్రముఖ వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. ప్రపంచ శాంతికోసం, లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో మండల దీక్షగా చేపట్టిన కోటి శ్రీలలితా సహస్రనామం ముగింపు సందర్భంగా ముంబయ్‌కి చెందిన శ్రీ మాతా పీఠాధీశ్వరి మాత శ్రీచందన అమృతానందవల్లి (మాతా యోగేశ్వరి) చేతుల మీదుగా గ్రామంలోని మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. శ్రీ శివదేవస్వామి సేవా సమితి నిర్వాహకులు ర్యాలి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకస్వాములు ర్యాలి శివరామకృష్ణప్రసాద్ (సిద్ధాంతి) 11 మంది రుత్వికులు పాల్గొని హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ధాన్యాన్ని త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి



ఆచంటలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ధాన్యాన్ని తర్వగా ఒబ్బిడి చేసుకొని మిల్లులకు తరలించుకోవాలని ఆచంట మండల తహసీల్దారు జి కనకరాజు తెలిపారు. బుధవారం ఆచంట మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటి వరకూ 8837 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. మండలంలో 5 లక్షల గోనె సంచులకు గాను, 365000 సంచల రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. సంచుల కొరత ఎక్కడాలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి నాగరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

మొగల్తూరు: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 13 నుంచి 2025 జనవరి 3 తేదీ వరుకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత వ్యక్తులు దరఖాస్తులు అందజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 13న కొత్తపాలెం, శేరేపాలెం, 17న పేరుపాలెం నార్త్, సౌత్, 18న కేపీపాలెం నార్త్, సౌత్, 19న మొగల్తూరు 4 సచివాలయాల పరిధిలోనూ, 20న రామన్నపాలెం 2 సచివాలయాల పరిధిలోనూ, 21న మోడి, వారతిప్ప, 27న కొత్తోట, ముత్యాలపల్లి, 28న కాళీపట్నం తూర్పు, పడమర, 2025 జనవరి 3న జగన్నాథపురం, పాతపాడు, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఈసదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దర్బరేవు డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం రూరల్: తీరప్రాంత గ్రామాల్లో పంట పొలాల ముంపునకు కారణంగా మారిన దర్బరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం నరసాపురం మండలం ఎల్బీచర్ల, మోడి గ్రామాల రైతులు మోడిలోని వంతెన వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనావు మాట్లాడుతూ దర్బరేవు డ్రెయిన్‌పై మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్ప వద్ద స్లూయిజ్ లేకపోవడంతో రైతులు పంటలు నష్టపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంగాని వడ్డి కాసులు, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, మల్లుల నాగరాజు, బైనపాలెం పండు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

పాలకొల్లు సెంట్రల్: నీటి సంఘాలకు సభ్యులను, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ విడుదల అయినట్లు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 14న సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నీటి సంఘం సాధారణ సర్వసభ్య సమావేశం దిగమర్రు, జిల్లా పరిషత్ హైస్కూల్, లంకలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్, శివదేవుని చిక్కాల, జిల్లా పరిషత్ హైస్కూల్, పాలకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ పూలపల్లి, వెలివెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సభ్యులు, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు అవమానం?

పాలకొల్లు సెంట్రల్: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా పట్టుకుని తిరిగిన సీనియర్ నాయకుడు మునిసిపల్ మాజీ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి గురించి పాలకొల్లు పట్టణంలో తెలియని వారు ఉండరు. అలాంటి వ్యక్తి మృతి చెందితే కనీసం పార్టీ జెండా కప్పడానికి కూడా టీడీపీ నాయకులు ఆలోచించారు. ఈ నెల 2న వల్లభు నారాయణమూర్తి మృతి చెందారు. అతని మృతదేహం వద్ద సంతాపం తెలపడానికి మంత్రితో పాటు టీడీపీ నాయకులందరూ హాజరయ్యారు. అంతిమయాత్ర ఆ రోజు రాత్రి 8 గంటలకు ప్రారంభించారు. ఇంతలో ఓ టీడీపీ నాయకుడు పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు... మునిసిపల్ మాజీ చైర్మన్ కూడా పార్టీ జెండా కప్పి నివాళులర్పించాలి కదా అని అన్నారు. అయితే ఈ విషయం మన ప్రజాప్రతినిధికి చెప్పాలి అని ఓ నాయకుడు సందేహం వ్యక్తం చేశారు. అతని కంటే మరో సీనియర్ నాయకుడు ఏమిటయ్యా ప్రజాప్రతినిధిని అడిగేది? అందరికన్నా ముందు నుంచే పార్టీలో ఉన్న వ్యక్తికి ఇదా మీరిచ్చే గౌరవం అంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. వెంటనే అతనే పార్టీ జెండా తీసుకుని నారాయణమూర్తి పార్థీవదేహంపై కప్పి గౌరవించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.